Follow: @ANNTELUGU

ANN తెలుగు

# మహా పత్రిక

17-08-2026

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 223 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షా కాల సమావేశాలు

### మండలిలో హోరాహోరీ

- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్


### పిల్లలు మీకు అర్థం కారు థెరపీ తీసుకోండి అంకుల్



- ప్రధాని దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలపై బాలీవుడ్ దర్శకుడి సెటైర్లు

02

### పరకాల నుండి మళ్ళీ రేవూరే



- సీఎం రేవంత్ సంచలన ప్రకటన
- కొండా ఆశలకు గండి

03

### 'టీజీ సేఫ్'.. కల్తీకి చెక్



- ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి

03

# వంద మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం పీకలేరు

### పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



- దమ్ముంటే సెప్టెంబర్ లో అసెంబ్లీకి కేసీఆర్ ను తీసుకురండి
- కార్యకర్తల రక్తాన్ని అమ్ముకున్నారు
- కేటీఆర్ కేటీఆర్ హరీష్ ఎందుకు రక్తదానం చేయరు?
- కష్టాల్లో ఉన్న చెల్లిని కేటీఆర్ ఇంటినుండి బయటకు పంపారు
- అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నారు
- ఓడించేవారే లేరన్న వారిని యశస్విని 50వేల ఓట్లమెజారిటీతో బండకేసికొట్టింది

**వరంగల్, మహా :** అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావాబావమరిది పదే పదే అడుగుతున్నారు.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్‌ను కూడా సభకు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, రెండున్నరేళ్ల మా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై చర్చిద్దామన్నారు. ఆదివారం పరకాల సభలో మాట్లాడిన సీఎం.. విడతల వారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేని వారు ఇప్పుడు మన పిల్లలను

మిగతా 3వ పేజీలో

## సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?



- మేడారం వనదేవతలను దర్శించిన సీఎం
- సమ్మక్కసారలమ్మలకు నిలువెత్తు బంగారం.. పెండింగ్ పనులపై కీలక ఆదేశాలు

**ములుగు, మహా :** మేడారంలో వనదేవతలను బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లాలో సీఎం పర్యటించారు. తొలుత మేడారంలో పర్యటించిన సీఎం.. వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు చేరుకుని గట్టమ్మ దేవాలయం వద్ద హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టరేట్

మిగతా 3వ పేజీలో



# అంతా రింగయ్యారు...!

### సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు..!

- గురుకుల్ ట్రస్ట్–ప్రభుత్వం మధ్య సుప్రీం కోర్టులో వివాదం...!
- ఖానామేట్ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో ప్రభుత్వ భూమి గల్లంతు...!
- కేసు పెండింగ్ లో ఉండగానే బరితెగించిన బిల్డర్లు...!
- నిషేదిత జాబితా 22 (ఏ) లో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు...!
- కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం.. అక్రమార్కులకు గ్రీన్ కార్పెట్..!

రియల్ మాఫియాతో కుమ్మక్కైన అధికారులంతా ప్రజా ధనాన్ని లూటీ చేస్తుర్నన్న ఆరోపణలు స్థానికంగా దుమారం రేపుతోంది.ఖానామేట్ ప్రభుత్వ భూముల పరిరక్షణ వ్యవహారంలో రెవెన్యూ యంత్రాంగం గాలికొదిలేసిసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . అత్యున్నత న్యాయస్థానంలో గత కొన్నేళ్లుగా కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగటం అధికారుల అవినీతి అక్రమాలకు అద్దం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. సుప్రీం కోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా కాలయాపన చేస్తూ సర్కార్ పెద్దలే అక్రమార్కులకు గ్రీన్ కార్పెట్ పరిచారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్లు 11/33, 11/34 లలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు గల్లంతవుతున్నా అటు రెవెన్యూ యంత్రాంగం, అంతస్థుల కొద్ది అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంతో అధికార యంత్రాంగం అక్రమార్కులతో 'రింగ్' అయ్యారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.ఘట్కేసర్ గురుకుల్ ట్రస్ట్-ప్రభుత్వం మధ్య భూ వివాదం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందని స్థానికులు మండి పడుతున్నారు. కేసు పెండింగ్ లో ఉన్నప్పటికీ బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు కొనసాగడం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు దిక్కరించడం కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మిగతా 2వ పేజీలో

## నెలకు రూ.70 వేల ఎస్ఐపి 24 ఏళ్లలో రూ.11 కోట్లు

కాంపౌండింగ్ పై ఫండ్స్ ఇండియా రీసెర్చ్ రిపోర్ట్

02

## బీసీసీఐలో కీలక మార్పులు

- వీవీఎస్ లక్ష్మణ్‌కు బాధ్యతలు!
- సెప్టెంబరు నుంచి 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' రోల్?
- గంభీర్, అగార్కర్, జట్టు మధ్య సమన్వయానికి కొత్త వ్యవస్థ

07

## సూర్యుడిపై భారీ విస్ఫోటనం




- భూమివైపు దూసుకొస్తున్న సౌర తుఫాను!
- ఆగస్టు 17న భూ అయస్కాంత క్షేత్రాన్ని తాకే అవకాశం
- ముప్పేమీ లేదు.. ధ్రువ ప్రాంతాల్లో 'అరోరా' కనువిందు

02




## విజయవాడలో లంచం బాగోతం

- రూ.15 లక్షలు తీసుకుంటూ రైల్వే ఇంజనీర్ అరెస్ట్
- రూ.179.50 కోట్ల సిగ్నలింగ్ ప్రాజెక్ట్‌లో రూ.7 కోట్ల లంచం డిమాండ్.
- ప్రైవేట్ వ్యక్తితో కలిసి సీబీఐకి చిక్కిన బాపిరాజు

03

# బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం

24 గంటల్లో వాయుగుండంగా మారే ఛాన్స్!
ఏపీకి వర్ష ముప్పు..
ఆరు జిల్లాలకు హెచ్చరికలు.
మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన.

02





# అంతా రింగయ్యారు...!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్ ఖానామేట్ సర్వే నంబర్లు 11/33, 11/34కు సంబంధించిన భూ వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేశంలోనే ప్రముఖ ఐటీ కేంద్రంగా గుర్తింపు పొందిన హైటెక్ సిటీకి అత్యంత సమీపంలో, కూకట్‌పల్లి ప్రధాన రహదారికి ఆనుకుని, బుట్టా కన్వెన్షన్ పక్కనే ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కొనసాగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 22(ఏ) నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్లు 11/33, 11/34ల పరిధిలో సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, యథేచ్ఛగా బహుళ అంతస్తుల కమర్షియల్ భవనాలను నిర్మిస్తూ అధికార యంత్రాంగానికే సవాల్ విసిరింది.
మరోవైపు ఈ భూములకు సంబంధించి ఘట్కేసర్ గురుకుల్ ట్రస్ట్-ప్రభుత్వం మధ్య న్యాయపరమైన వివాదం కొనసాగుతోందని, భూముల హోదాపై ఇంకా తుది స్పష్టత రావాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వివాదం న్యాయస్థానాల పరిధిలో ఉండగానే భారీ స్థాయిలో కమర్షియల్ నిర్మాణాలు సాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తవగా, ఏడో అంతస్తు పనులు కూడా శరవేగంగా కొనసాగటం విస్మయానికి గురిచేస్తుంది.

**సుప్రీంకోర్టులో కేసు...**
**క్షేత్రస్థాయిలో నిర్మాణాల జోరు..!**
సర్వే నంబర్లు 11/33, 11/34కు సంబంధించిన భూముల అంశం అత్యున్నత న్యాయస్థానం పరిధిలో ఉండగా, అవే భూముల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతుండటం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. భూముల యాజమాన్యం, హక్కులు, హోదాకు సంబంధించి న్యాయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో నిర్మాణ కార్యకలాపాలు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.







స్థానికుల వాదన ప్రకారం, న్యాయస్థానంలో వ్యవహారం పెండింగ్‌లో ఉండగానే సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తవడం, మరిన్ని అంతస్తుల పనులు కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో పరిస్థితి యథాతథంగా ఉండాల్సిన సందర్భాల్లో ఇలాంటి నిర్మాణాలు కొనసాగితే, అది న్యాయస్థాన దృష్టికి తీసుకెళ్లాల్సిన అధికార యంత్రాంగం మీన మేషాలు లెక్కిస్తుందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

**కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం...**
**అక్రమార్కులకు గ్రీన్ కార్పెట్..?**
ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న స్థలానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు సమగ్ర కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కూడా పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పోరాడాల్సిన యంత్రాంగం న్యాయస్థానంలోనే కౌంటర్ దాఖలు చేయక పోవడం వల్ల అక్రమార్కులకు పరోక్షంగా అవకాశం కల్పిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



**సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తులు పూర్తి...**
**ఏడో అంతస్తు శరవేగంగా పనులు..**
స్థానికుల సమాచారం ప్రకారం సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తికాగా, ఏడో అంతస్తు పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణం ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికారులు, ఇప్పుడు భవనం పూర్తి దశకు చేరుకున్న తర్వాత కూడా ప్రభావవంతమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జరుగుతున్న విషయం అందరికీ కనిపిస్తుంటే, సంబంధిత అధికారులకు ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.


వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తికి సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందో వెల్లడించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు .

**టౌన్ ప్లానింగ్ చట్టాలు సామాన్యులకేనా..**
జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 461(ఎ) ప్రకారం అక్రమ నిర్మాణాలను గుర్తించడం, నోటీసులు జారీ చేయడం, సీజ్ చేయడం, అవసరమైతే కూల్చివేత చర్యలు చేపట్టే అధికారాలు ఉన్నప్పటికీ ఖానామేట్ వ్యవహారంలో అవి అమలులో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజల విషయంలో కఠినంగా వ్యవహరించే అధికారులు, ఇంత భారీ నిర్మాణాల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.




**అధికారులు–అక్రమార్కులు రింగ్ ..**
ఇంత భారీ స్థాయిలో నిర్మాణాలు నగర నడిబొడ్డున, ప్రధాన రహదారికి ఆనుకుని నెలల తరబడి కొనసాగుతున్నప్పటికీ వాటిని అడ్డుకునే చర్యలు కనిపించక పోవడంతో సంబంధిత శాఖల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ విభాగాల కొందరు అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. వారి కనుసన్నల్లోనే నిర్మాణాలు కొన సాగుతున్నాయని, లేకపోతే నిర్మాణాలు ఈ స్థాయికి చేరుకునేవి కావని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నిద్రపోతున్న నిఘా వ్యవస్థలు..!**
హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో, ప్రధాన రహదారికి


To, The District Collector, Ranga Reddy District, Telangana
Subject: Request for Immediate Inquiry and Action Against Illegal Encroachment and Unauthorized Commercial Constructions in Government Land (Kharij Khata) in Survey Nos. 11/33 and 11/34 of Khanamet Village, Serilingampally Mandal-Reg
Respected Sir,
I am writing to bring to your kind notice a matter of grave public interest involving the blatant encroachment and ongoing large-scale unauthorized commercial construction on high-value Government land situated in Survey Nos. 11/33 and 11/34 of Khanamet Village, Serilingampally Mandal, Ranga Reddy District.
As per the provisions of Section 22-A(1)(a) of the Registration Act, 1908, and in accordance with Memo No. 469/Land Admin.(II)/2020-2 (dated 01-09-2025) issued by the Government and CCLA Ref. No. Assn.1/3282276/2025 (dated 11-09-2025), the official Prohibited Properties List issued by the District Collector, Ranga Reddy, on 15-11-2025 clearly identifies Survey Nos. 11/33 and 11/34 of Khanamet Village as protected Government Land.
According to the official revenue records and the prohibited list:
- Survey No. 11/33: Admeasuring 76,835 square yards (15 Acres and 35 Guntas)
- Survey No. 11/34: Admeasuring 10,769 square yards (2 Acres and 09 Guntas)

Both parcels of land are strictly classified as "Kharij Khata – State Government."
Despite the land being officially recorded as Government property, it is highly alarming that active, large-scale commercial construction is currently being undertaken over an extent of approximately 4,000 square yards within this very government land. The fact that such extensive construction near Hitech City—worth more than Rs. 100 Crores—is continuing unabated right under the nose of local administrative bodies has raised serious concerns among citizens regarding the protection of public assets.
Although several complaints have already been submitted to the Revenue, Municipal, and Town Planning authorities, and multiple representations have been logged through the Prajavani grievance platform, no concrete on-ground action has been taken. The Town Planning

**ప్రజా వాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు...**
**చెత్త బుట్టకే పరిమితం..!**
ఈ వ్యవహారంపై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినప్పటికీ, సంబంధిత శాఖలకు ఆధారాలు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు కేవలం ఫైళ్లకే పరిమితమయ్యాయా? లేక కావాలనే నిర్లక్ష్యం ప్రదర్శించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆనుకుని, వందల కోట్ల రూపాయల విలువైన భూమిలో నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ పర్యవేక్షణ వ్యవస్థలు ఏమి చేస్తున్నాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నెలల తరబడి నిర్మాణాలు కొనసాగినా వాటిని గుర్తించలేదా? గుర్తించినా ఉన్నతాధికారులకు నివేదించలేదా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**హైడ్రా, కలెక్టర్, సీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకుంటారా..**
ఈ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రెవెన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం, హైడ్రా ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భూముల హోదా, నిర్మాణాల చట్టబద్ధత, అనుమతుల ప్రక్రియ, అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎప్పుడు..?**
22(ఏ) నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు ఎలా జరిగాయి? కోర్టు వివాదం కొనసాగుతుండగా పనులు ఎలా ముందుకు వెళ్లాయి? ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా అధికారులు ఎందుకు స్పందించలేదు? ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? అనే ప్రశ్నలకు ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఖానామేట్ భూ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే స్వతంత్ర విచారణే మార్గమని వారు పేర్కొంటున్నారు.













# నెలకు రూ.70 వేల ఎస్ఐపి 24 ఏళ్లలో రూ.11 కోట్లు

- **కాంపౌండింగ్ పై ఫండ్స్ ఇండియా రీసెర్చ్ రిపోర్ట్**

**మహా :** ప్రతి నెలా క్రమం తప్పకుండా చేసే చిన్న పొదుపు, దీర్ఘకాలంలో ఎంత పెద్ద సంపదను సృష్టిస్తుందో చాలామందికి అవగాహన ఉండదు. క్రమానుగత పెట్టుబడి విధానం (SIP)లో ఉన్న అద్భుతమైన శక్తి 'కాంపౌండింగ్'. దీనినే చక్రవడ్డీ ప్రభావం అని కూడా అంటారు. పెట్టుబడి ప్రయాణం ప్రారంభంలో నెమ్మదిగా కనిపించినా, కాలం గడిచే కొద్దీ సంపద సృష్టిలో దీని వేగం చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఫండ్స్‌ఇండియా రీసెర్చ్ అందించిన ఒక నివేదిక ప్రకారం, ఒక వ్యక్తి నెలకు రూ.70,000 చొప్పున ఒక SIPలో పెట్టుబడి పెడుతూ, దానికి వార్షికంగా సగటున 12 శాతం రాబడి వస్తుందని అనుకుందాం. ఈ లెక్కన అతని పోర్ట్‌ఫోలియో విలువ రూ.11 కోట్లకు చేరడానికి సుమారు 23 సంవత్సరాల 8 నెలల సమయం పడుతుంది. సంపద సృష్టిలో కాంపౌండింగ్ పాత్ర స్పష్టంగా అర్థమవుతుంది. మొదటి రూ.1.1 కోట్లు సమకూరడానికి దాదాపు 8 ఏళ్లు పట్టింది. ఈ మొత్తంలో 60 శాతం పెట్టుబడిదారుడి సొంత డబ్బే కాగా, 40 శాతం మాత్రమే రాబడి ద్వారా వచ్చింది. కానీ, పోర్ట్‌ఫోలియో విలువ రూ.9.9 కోట్ల నుంచి రూ.11 కోట్లకు చేరడానికి (అంటే చివరి రూ.1.1 కోట్లకు) కేవలం 10 నెలల సమయం మాత్రమే పట్టింది. ఈ పెరుగుదలలో 94 శాతం కేవలం రాబడి నుంచే రావడం విశేషం. పెట్టుబడిదారుడి సొంత డబ్బు కేవలం 6 శాతం మాత్రమే. దీనిని నిపుణులు సరదాగా "843 నియమం" అని కూడా పిలుస్తారు. మొదటి రూ.1.1 కోట్లకు 8 ఏళ్లు, తర్వాతి కోటికి 4 ఏళ్లు, ఆ తర్వాతి కోటికి 3 ఏళ్లు పడుతుంది. సుమారు 20 ఏళ్లు దాటిన తర్వాత, అదే ఎస్ ఐపి కొనసాగిస్తే దాదాపు ప్రతి ఏటా ఒక కోటి రూపాయలు పోర్ట్‌ఫోలియోకు జతవుతూ ఉంటుంది

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షా కాల సమావేశాలు

( మొదటి పేజీ తరువాయి )

సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.


**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**
సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**
అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు. దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

# 24 గంటల్లో వాయుగుండంగా మారే ఛాన్స్!

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష ముప్పు పొంచి ఉంది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. ఇది రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.
అల్పపీడనం ప్రభావం ప్రధానంగా ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాలపై కనిపించే అవకాశముంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, పోలవరం జిల్లాలకు వర్ష సూచనతో పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**పిడుగులతో వర్షా లు.. అప్రమత్తంగా ఉండాల్సిందే**
అల్పపీడనం బలపడుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉండే ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు. పిడుగులు పడే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు.



**నెల్లూరు, తిరుపతికీ వర్ష సూచన**
ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలపైనా అల్పపీడనం ప్రభావం చూపే అవకాశం ఉంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో వాతావరణ పరిస్థితుల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**సముద్రం అలజడి.. మత్స్యకారులకు కీలక హెచ్చరిక**
అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉంది. సముద్రంలో అలలు ఉధృతంగా ఉండటంతో మత్స్యకారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అల్పపీడనం వాయుగుండంగా మారితే సముద్ర పరిస్థితులు మరింత ప్రతికూలంగా మారే అవకాశం ఉండటంతో ఈ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# పిల్లలు మీకు అర్థం కారు

## బాలీవుడ్ దర్శకుడి సెటైర్లు

**మహా :** సోషల్ మీడియా వేదికగా ప్రధాని వ్యాఖ్యలపై ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ స్పందిస్తూ నేటి రాజకీయ భాష యువతరం ఆందోళనలను, వారి ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందా అని ప్రశ్నించారు. "ఈ పెద్దవాళ్లకు ఇప్పటి పిల్లలు అస్సలు అర్థం కారు. 'దిమాగీ నక్సల్' అనగానే ఏదో బ్రహ్మాస్త్రం ప్రయోగించామని అనుకుంటున్నారు. అంకుల్.. ఇప్పటి పిల్లలకు నక్సల్ అంటే ఏంటో కూడా తెలియదు. ముందుగా పుస్తకాల్లోంచి తొలగించిన పాఠ్యాంశాలను మళ్లీ చేర్చండి. కానీ దాని కోసం స్కూళ్లను బాగుచేయాలి, టీచర్లను నియమించాలి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా, నేటి తరాన్ని అర్థం చేసుకోవడానికి పాలకులకు కొన్ని సలహాలు కూడా ఇచ్చారు. "నా సలహా ఏంటంటే.. కాస్త థెరపీ తీసుకోండి. అది చాలా అవసరం. ఆ తర్వాత వాళ్లని ప్రభావితం చేయాలంటే జెన్‌జెడ్ భాష కూడా నేర్చుకోవాలి. దాని కోసం మీరు కూడా చదువుకోవాలి" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ తర్వాత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మరోసారి విమర్శలు గుప్పించారు. ఈసారి ఆన్‌లైన్ ట్రోల్స్‌ను ఉద్దేశించి.. "ఈసారి నా పోస్టుపై వెయ్యి మందికి పైగా ట్రోల్స్ రాలేదు. బహుశా ప్రభుత్వ ఐటీ సెల్ ఆర్థిక పరిస్థితి బాగాలేనట్టుంది. ప్రపంచ బ్యాంకు నుంచి మరికొంత అప్పు తీసుకోవాలేమో" అంటూ సెటైర్ వేశారు.

# సూర్యుడిపై భారీ విస్ఫోటనం

**ఢిల్లీ, మహా :** అంతరిక్షంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సూర్యుడి ఉపరితలంపై సంభవించిన శక్తివంతమైన ప్లాస్మా విస్ఫోటనం కారణంగా భారీగా విడుదలైన విద్యుదావేశిత కణాలు భూమి వైపు దూసుకొస్తున్నాయి. ఆగస్టు 14న సూర్యుడి ఉపరితలంలోని భారీ అయస్కాంత నిర్మాణంలో చోటుచేసుకున్న మార్పుతో కరోనల్ మాస్ ఎజెక్షన్ సంభవించినట్లు అంతరిక్ష వాతావరణ పరిశోధకులు గుర్తించారు. ఈ ప్లాస్మా మేఘం సోమవారం, ఆగస్టు 17న భూమి అయస్కాంత క్షేత్రాన్ని తాకే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.సూర్యుడి నుంచి భారీగా వెలువడిన విద్యుదావేశిత ప్లాస్మా అంతరిక్షంలో వేగంగా ప్రయాణిస్తూ భూమివైపు వస్తోంది. అంతరిక్ష వాతావరణ సంస్థలు దీని కదలికను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. భూమిని నేరుగా తాకినప్పుడు సౌర తుఫానుగా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుత అంచనాల ప్రకారం ఇది G1 స్థాయి సౌర తుఫానుగా ఉండే అవకాశం ఉంది. ఈ స్థాయి తుఫానును తక్కువ తీవ్రత కలిగిన భూ అయస్కాంత తుఫానుగా పరిగణిస్తారు.

**భూమికి ముప్పు లేదు.. కానీ ఆకాశంలో అద్భుతం!**
ఈ సౌర తుఫాను కారణంగా సాధారణ ప్రజల రోజువారీ జీవితానికి ఎలాంటి ప్రత్యక్ష ముప్పు ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భూమి అయస్కాంత క్షేత్రంతో సూర్యుడి నుంచి వచ్చిన అధిక శక్తి కణాలు ఢీకొన్నప్పుడు ధ్రువ ప్రాంతాల్లో అద్భుతమైన కాంతి దృశ్యాలు ఏర్పడే అవకాశం ఉంది.
ఉత్తర అమెరికా, యూరప్‌లోని అధిక అక్షాంశ ప్రాంతాల్లో రాత్రి ఆకాశంలో 'అరోరా బొరియాలిస్'గా



పిలిచే రంగురంగుల కాంతులు కనిపించే అవకాశం ఉంది. ఆకుపచ్చ, గులాబీ, ఊదా వంటి రంగుల్లో ఆకాశం మెరిసిపోతూ కనిపించే ఈ సహజ దృశ్యం అంతరిక్ష ప్రేమికులకు కనువిందు చేయనుంది.

**అసలు ఈ సౌర తుఫాను ఎలా ఏర్పడింది?**
సూర్యుడి ఉపరితలంపై భారీ అయస్కాంత శక్తి ఒక్కసారిగా విడుదలైనప్పుడు శక్తివంతమైన సౌర విస్ఫోటనాలు చోటుచేసుకుంటాయి. వాటిలో భాగంగా సూర్యుడి కరోనా నుంచి భారీగా ప్లాస్మా, అయస్కాంత క్షేత్రాలు అంతరిక్షంలోకి విసిరివేయబడే ప్రక్రియనే కరోనల్ మాస్ ఎజెక్షన్ అంటారు.
ఆగస్టు 14న జరిగిన ఇలాంటి విస్ఫోటనం నుంచి విడుదలైన ప్లాస్మా మేఘమే ప్రస్తుతం భూమి వైపు ప్రయాణిస్తోంది. దీని వేగం, దిశ, అయస్కాంత బలం ఆధారంగా భూమిపై ప్రభావం తీవ్రత మారుతుంది. అందుకే శాస్త్రవేత్తలు దీని కదలికను నిరంతరం గమనిస్తున్నారు.

**ఉపగ్రహాలు, రేడియో వ్యవస్థలపై ప్రభావం ఉంటుందా?**
G1 స్థాయి సౌర తుఫానుతో సాధారణంగా భూమిపై పెద్దగా అంతరాయం ఏర్పడే అవకాశం ఉండదు. అయినప్పటికీ అంతరిక్ష వాతావరణ పరిస్థితులు ఉపగ్రహాల పనితీరు, అధికఅక్షాంశ విద్యుత్ వ్యవస్థలు, రేడియో కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలపై స్వల్ప ప్రభావాన్ని చూపే అవకాశం ఉంటుంది.
అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం ఈ తుఫాను వల్ల సాధారణ ప్రజలు భయపడాల్సిన పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు. విమాన ప్రయాణాలు, మొబైల్ ఫోన్లు, సాధారణ ఇంటర్నెట్ సేవలు వంటి రోజువారీ వ్యవస్థలకు పెద్ద స్థాయిలో అంతరాయం కలిగే సూచనలు లేవు.

**సూర్యుడు ఇప్పుడు 'యాక్టివ్ మోడ్'లో!**
ప్రస్తుతం సూర్యుడు తన సుమారు 11 ఏళ్ల సౌర చక్రంలో అత్యంత చురుకైన దశ అయిన సౌర గరిష్ఠ స్థితి చుట్టుపక్కల కాలాన్ని ఎదుర్కొంటున్నాడు. ఈ సమయంలో సూర్యుడిపై సన్‌స్పాట్లు, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్లు సాధారణం కంటే ఎక్కువగా చోటుచేసుకుంటాయి.అందువల్ల ఇటీవలి కాలంలో వరుసగా సౌర విస్ఫోటనాలు, భూ అయస్కాంత తుఫానులు నమోదవుతున్నాయి. సూర్యుడి కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ భూమికి చేరే అంతరిక్ష వాతావరణ ప్రభావాలను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయి.

**శాస్త్రవేత్తలకు మరో విలువైన అవకాశం**
ప్రస్తుతం భూమివైపు వస్తున్న ఈ చిన్న స్థాయి సౌర తుఫాను ప్రమాదకరమైనదిగా కాకుండా శాస్త్రీయ పరిశోధనలకు ఉపయోగకరమైన పరిణామంగా మారనుంది. సూర్యుడి నుంచి వెలువడిన కణాలు భూమి అయస్కాంత కవచంతో ఎలా పరస్పర చర్య జరుపుతాయి? ఉపగ్రహాలు, రేడియో కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలపై ఎంత మేర ప్రభావం ఉంటుంది? వంటి అంశాలను పరిశీలించేందుకు శాస్త్రవేత్తలకు ఇది మరో సహజ ప్రయోగంలా ఉపయోగపడనుంది.





# వంద మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం పీకలేరు





(మొదటి పేజీ తరువాయి)
రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం అన్నారు. అగ్గిపెట్టేరావు, అఘోరరావు మాటలు వింటే మోసపోతారని నిరుద్యోగులు నిరసనల్లో పాల్గొంటే కేసులతో ఇబ్బందిపడతారని హెచ్చరించారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అహర్నిశలు కష్టపడుతున్నామని స్పష్టం చేశారు.

**కార్యకర్తల రక్తాన్ని అమ్ముకున్నారు:**
రక్తదానం పేరుతో హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల రక్తాన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని సొమ్ముచేసుకున్నారని మీరు మనుషులా రాక్షసులా అని సీఎం ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబం రక్తపిపాసులుగా మారారని ధ్వజమెత్తారు. పార్టీలో పదవులు తీసుకున్న కేసీఆర్ కుటుంబం ఆయన బంధువులు ఎందుకు రక్తదానం చేయలేదు? అని నిలదీశారు. ప్రజల కోసం ఎంతవరకైనా కష్టపడతానని మీ ఆశీర్వాదం ఉన్నంత వరకు వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరన్నారు. సోషల్ మీడియాలో పెడితే ఒరిగేది లేదు కరిగేదని, రేపు శాసనసభలోనే తేల్చుకుందామన్నారు.

**బండకేసి కొట్టారు**
ఎప్పటికీ అధికారంలోనే ఉంటామని విర్రవీగిన వారిని వరంగల్ జిల్లా ప్రజలు బండకేసి కొట్టారని, తమను ఓడించేవారే లేరనుకున్న వారిని రాజకీయంగా బొందపెట్టారని సీఎం వ్యాఖ్యానించారు. కాకలు తీరిన రాజకీయ నేతలను యశస్విని రెడ్డి భారీ మెజారిటీతో ఓడించి ప్రజల తీర్పు ఏంటో చూపించారని గుర్తుచేశారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం చెప్పారు. బీఆర్ఎస్ రెండుసార్లు రుణమాఫీ పేరిట మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసి చూపించిందన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు జమ చేశామని, మొత్తంగా రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.లక్షా 37 వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. అ

**కవితను ఇంటి నుంచి పంపేశారు**
జైలుకుపోయి కష్టాల్లో వచ్చిన తన సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితను కేటీఆర్ ఇంటి నుంచి బయటకు పంపేశాడని ఇదంతా చూస్తున్న కేసీఆర్ తన కొడుకుకు బుద్ధి చెప్పాల్సిది పోయి మౌనంగా ఉండిపోయారని విమర్శించారు. ఇక అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. చేస్తున్నారని దుయ్యబట్టారు. అమాయకులైన బీఆర్ఎస్ కార్యకర్తల రక్తాన్ని హరీశ్ రావు, కేటీఆర్ ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని పైసలు సంపాధించుకుంటున్నారంటే వారు ఎలాంటివారో అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.











# సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?

**(మొదటి పేజీ తరువాయి)**
భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు.
“ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మొదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలు తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తాం. ములుగు ప్రాంత అభివృద్ధికి ఏం కావాలో చెబితే నిధులు మంజూరు చేస్తాం.

**సీతక్కను సొంత ఆడబిడ్డలా..**
రక్తం పంచుకు పుట్టకపోయినా సీతక్కను సొంత ఆడబిడ్డగా చూసుకుంటున్నాం. కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే బయటకు నెట్టారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు.. రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా? కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారు. సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగభాగం ఉన్నట్లే. అలాంటి తండ్రీకుమారులు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులు. ఇంకొకరు అఘోరారావు.. అఘోరా పూజలు చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకున్నారు. దేవుడు మనవైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు. అని సీఎం అన్నారు.

**రేవంత్ నాయకత్వంలో ములుగు అభివృద్ధి: మంత్రి సీతక్క**
ములుగు అంటే గతంలో అభివృద్ధి లేని ప్రాంతం అనేవారని మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఈ జిల్లా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. “పదేళ్లు కొట్లాడితే ములుగు జిల్లా ఇచ్చారు. ఏడాదిలో మూడుసార్లు వనదేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్. రాష్ట్రంలో ఏ జిల్లాకూ ఇవ్వనన్ని ఇందిరమ్మ ఇళ్లు ములుగు జిల్లాకు ఇచ్చారు” అని చెప్పారు.







# విజయవాడలో లంచం బాగోతం

**విజయవాడ, మహా :** విజయవాడలో భారీ లంచం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రూ.179.50 కోట్ల విలువైన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.7 కోట్ల లంచం డిమాండ్ చేసిన ఆరోపణలపై ఓ రైల్వే ఇంజనీర్‌ను సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.15 లక్షల నగదు లంచం తీసుకుంటుండగా రైల్వే అధికారి బాపిరాజుతో పాటు ఆయనకు మధ్యవర్తిగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.
రైల్వే శాఖకు సంబంధించిన భారీ ప్రాజెక్టులో కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ దర్యాప్తులో ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. రూ.179.50 కోట్ల విలువైన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రాజెక్టులో ఏకంగా రూ.7 కోట్ల మేర 'బోనస్' లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం సంచలనంగా మారింది.

**రూ.15 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న సీబీఐ**
లంచం డిమాండ్‌పై సమాచారం అందుకున్న సీబీఐ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. డిమాండ్ చేసిన మొత్తంలో భాగంగా రూ.15 లక్షలు తీసుకుంటున్న సమయంలో రైల్వే ఇంజనీర్ బాపిరాజును అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఆయనతో పాటు లంచం వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.
అనంతరం ఇద్దరి నుంచి కీలక పత్రాలు, లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అరెస్టు అనంతరం వారి నివాసాలు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లోనూ సోదాలు నిర్వహించే అవకాశం ఉంది.


**భారీ ప్రాజెక్టుల్లో 'బోనస్' పేరుతో రూ.7 కోట్ల డిమాండ్**
ఈ కేసులో అత్యంత సంచలన అంశం రూ.7 కోట్ల లంచం డిమాండ్ ఆరోపణ. సాధారణంగా భారీ ప్రభుత్వ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లు ఎదుర్కొనే బిల్లుల చెల్లింపులు, పనుల ధ్రువీకరణ, అనుమతులు తదితర అంశాలను ఆసరాగా చేసుకుని లంచాలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వస్తుంటాయి. అయితే ఈ కేసులో రూ.179.50 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి ఏకంగా రూ.7 కోట్ల మేర డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.
సీబీఐ దర్యాప్తులో ఈ మొత్తం ఎవరికి చేరాల్సి ఉంది? లంచం డిమాండ్ వెనుక మరెవరైనా అధికారులు ఉన్నారా? ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్ పాత్ర ఏమిటి? అనే కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

**రైల్వేలో అవినీతిపై సీబీఐ నజర్**
భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో అవినీతి, అక్రమ లావాదేవీలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు నిఘా కొనసాగిస్తున్న నేపథ్యంలో విజయవాడలో ఈ అరెస్టులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా రైల్వే వంటి కీలక మౌలిక వసతుల సంస్థకు సంబంధించిన వందల కోట్ల ప్రాజెక్టుల్లో లంచం డిమాండ్ ఆరోపణలు రావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
ప్రస్తుతం బాపిరాజు, శ్రీచంద్‌లను సీబీఐ అధికారులు విచారిస్తున్నారు. లంచం వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా? డిమాండ్ చేసిన రూ.7 కోట్ల మొత్తంలో ఇప్పటికే ఎంత మేరకు లావాదేవీలు జరిగాయి? ప్రాజెక్టుకు సంబంధించిన ఏ పనులు, బిల్లులు లేదా అనుమతుల కోసం ఈ మొత్తాన్ని డిమాండ్ చేశారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.
రూ.179.50 కోట్ల రైల్వే సిగ్నలింగ్ ప్రాజెక్ట్.. రూ.7 కోట్ల లంచం డిమాండ్.. చివరకు రూ.15 లక్షలు తీసుకుంటూ సీబీఐకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఇంజనీర్.. ఈ మొత్తం వ్యవహారం విజయవాడ రైల్వే వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఈ కేసులో మరిన్ని సంచలన వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## పరకాల నుండి మళ్ళీ రేవూరే

- సీఎం రేవంత్ సంచలన ప్రకటన
- కొండా ఆశలకు గండి

**పరకాల, మహా :** వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు సుష్మితను బరిలోకి దించాలన్న యోచిస్తున్న మంత్రి కొండా సురేఖకు సీఎం రేవంత్ రెడ్డి షాకిచ్చారనే చెప్పాలి. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించిన సీఎం.. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం వెయ్యిమంది కేసీఆర్‌లు వచ్చినా తమ వెంట్రుక కూడా పీకలేరని, 2029లో రెట్టింపు మెజారిటీతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించాలని కోరారు. అందులో భాగంగా రానున్న ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డే మరోసారి పోటీ చేస్తారని బహిరంగ ప్రకటన చేశారు. దీంతో కొండా ఫ్యామిలీ ఆశలకు గండిపడ్డట్లయింది.



# 'టీజీ సేఫ్' .. కల్తీకి చెక్

- ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. 'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.



# 'ఇరుముడి'పై అంచనాలు పెంచుతున్న ట్రైలర్


మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, మెలోడీ, ఎనర్జిటిక్ సాంగ్స్ సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేయగా.. తాజాగా విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ అంచనాలను మరింత పెంచింది.

ఈ నేపథ్యంలో 'ఇరుముడి'లోని మోస్ట్ అవైటెడ్ సాంగ్ 'మల్లెపూల పల్లకి'ని మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ లో విడుదల చేశారు. అయ్యప్ప భక్తుల్లో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉన్న ఈ పాటకు ఒరిజినల్ భక్తి భావాన్ని కొనసాగిస్తూనే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ కొత్త మ్యూజికల్ టచ్ ఇచ్చారు. గ్రాండ్ ఆర్కెస్ట్రేషన్, పవర్‌ఫుల్ రిథమ్స్‌తో పాటను మరింత ఎనర్జిటిక్‌గా తీర్చిదిద్దారు.

ఈ పాట గురించి దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'మల్లెపూల పల్లకి' కోసం చాలా శ్రమించామని తెలిపారు. ఒరిజినల్ కంపోజర్స్, సింగర్స్‌ను పిలిపించి వారితోనే ఈ పాటను చేయించినట్లు చెప్పారు. ఈ పాట థియేటర్‌లో తాండవంలా ఉంటుందని పేర్కొన్నారు.'ఇరుముడి' తన గత చిత్రాల మాదిరిగా లైట్ హార్టెడ్‌గా ఉండదని శివ నిర్వాణ స్పష్టం చేశారు. ఇది చాలా సీరియస్, ఇంటెన్స్ ఫ్యామిలీ డ్రామా అని తెలిపారు. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు ప్రేక్షకులను అత్యంత ఉత్కంఠభరితమైన డ్రామాలోకి తీసుకెళ్తాయని చెప్పారు. తెలుగు సినిమాల్లో వచ్చిన మోస్ట్ ఇంటెన్స్ అండ్ సీరియస్ ఫ్యామిలీ డ్రామాల్లో 'ఇరుముడి' ఒకటిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రవితేజతో పనిచేయడం గర్వంగా ఉందని శివ నిర్వాణ అన్నారు. ఆయన అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులకు మరోసారి చూడాలనిపించేలా ఉంటుందని తెలిపారు. సీలేరు ప్రాంతంలోని రియల్ లొకేషన్స్‌లో సినిమాను తెరకెక్కించినట్లు చెప్పారు. రవితేజతో పాటు ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు తమ పాత్రల్లో అద్భుతంగా నటించారని ప్రశంసించారు.ముఖ్యంగా రవితేజ, నక్షత్ర మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయని శివ నిర్వాణ పేర్కొన్నారు. నక్షత్ర పెర్ఫార్మెన్స్ చూస్తే కన్నీళ్లు వచ్చేంతగా ఉంటుందని అన్నారు. ప్రియా భవానీ శంకర్‌కు సినిమాలో మూడు కీలక సన్నివేశాలు ఉన్నాయని, అవి థియేటర్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయని చెప్పారు.జీవీ ప్రకాష్ కుమార్ సంగీతంపై కూడా శివ నిర్వాణ ప్రశంసలు కురిపించారు. తాను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచే ఆయన సంగీతాన్ని ఇష్టపడుతున్నానని, 'ఇరుముడి'కి జీవీ ప్రకాష్ అద్భుతమైన సంగీతాన్ని అందించారని తెలిపారు. సినిమాటోగ్రాఫర్ విష్ణు శర్మ తనకు రైట్ హ్యాండ్‌లా పనిచేశారని, సినిమా చూసిన తర్వాత ఆయన సినిమాటోగ్రఫీ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారని శివ నిర్వాణ అన్నారుమొత్తంగా 'ఇరుముడి' కేవలం ఫ్యామిలీ డ్రామా మాత్రమే కాదని.. ప్రేక్షకులకు బలమైన ఎమోషనల్ ఎక్స్‌పీరియన్స్‌తో పాటు మంచి మెసేజ్‌ను అందించే సినిమా అని దర్శకుడు శివ నిర్వాణ వెల్లడించారు. ఆగస్టు 21న ఈ సినిమా థియేటర్లలోకి రానుండటంతో రవితేజ అభిమానుల్లోనూ, సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది.

# స్క్రిప్ట్ విషయంలో రాజీపడను: యశ్

రాకింగ్ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 'కేజీఎఫ్' తర్వాత ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా యశ్ తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.టీవీ సీరియల్స్‌లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకున్న సమయంలో తనకు ఏడు సినిమాల్లో అవకాశాలు వచ్చాయని యశ్ తెలిపారు. అయితే ప్రతి సినిమాకీ ముందుగా స్క్రిప్ట్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు చెప్పారు. స్క్రిప్ట్ నచ్చకపోతే ఆ పాత్రను తాను ఆస్వాదించలేనని, ప్రేక్షకులకు కూడా నచ్చేలా చేయలేనని పేర్కొన్నారు. ఈ విషయంలో రాజీపడకపోవడంతో ఆ ఏడు సినిమాల అవకాశాలు కోల్పోయినా ఎప్పుడూ బాధపడలేదన్నారు. పారితోషికం విషయంలోనూ తనది భిన్నమైన విధానమని యశ్ తెలిపారు. తన మార్కెట్ వ్యాల్యూకు అనుగుణంగా పారితోషికం తీసుకుంటానని, అయితే నిర్మాత భారీ మొత్తాన్ని ముందుగానే చెల్లించి రిస్క్ మొత్తం భరించే విధానం తనకు ఇష్టం ఉండదన్నారు. నిర్మాత ఎంత రిస్క్ తీసుకుంటే తానూ అంతే రిస్క్ తీసుకోవాలనేది తన సిద్ధాంతమని చెప్పారు. సినిమా విజయవంతమైతే లాభాల్లో వాటా ఉండాలని, నష్టాలు వస్తే వాటిని కూడా కలిసి భరించాలనుకుంటానన్నారు. 'కేజీఎఫ్' విజయంపై స్పందిస్తూ.. తక్కువ బడ్జెట్ తో తెరకెక్కినప్పటికీ ప్రేక్షకులు సినిమాను ఎంతో ఆదరించారని యశ్ గుర్తుచేసుకున్నారు. ప్రేక్షకుల నమ్మకమే తనకు అతి పెద్ద బలమని చెప్పారు. స్టార్‌గా ఎదిగిన తర్వాత తన జీవనశైలిలో పెద్దగా మార్పు రాలేదని, ప్రస్తుతం మరింత బాధ్యతగా పని చేస్తున్నానని తెలిపారు. 'కేజీఎఫ్'లోని పవర్‌ఫుల్ డైలాగ్స్‌ను నిజ జీవితానికి అన్వయించుకోవాల్సిన అవసరం లేదని యశ్ స్పష్టం చేశారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రతికూలంగా కాకుండా సరైన ఆలోచనతో ఎదుర్కోవాలనేది తన నమ్మకమని చెప్పారు. ప్రస్తుతం 'టాక్సిక్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో కియారా అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# సాంప్రదాయ లుక్‌లో త్రిష కనువిందు

దక్షిణాది సినీ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటి త్రిష కృష్ణన్ మరోసారి తన అందం, సాంప్రదాయ శైలితో ఆకట్టుకున్నారు. పసుపు రంగు చీరలో ఆమె కనిపించిన తీరు ఎంతో క్లాసిక్‌గా, హుందాగా ఉంది. ఈ చీర తన తల్లికి చెందినదని త్రిష వెల్లడించారు. దీనికి లేత ఆకుపచ్చ రంగులో మెరిసే బ్లౌజ్‌ను జత చేయడంతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది.

సాంప్రదాయ ఆభరణాల్లో భాగంగా అందమైన జుంకా చెవిపోగులను ధరించిన త్రిష.. జుట్టును చక్కగా పైకి ముడివేసి, అందులో తెల్లని మల్లెపూలను అలంకరించుకున్నారు. మృదువైన లైటింగ్, ప్రశాంతమైన పోజ్‌తో తీసిన ఈ ఫొటోషూట్ ఆమె సహజమైన అందాన్ని మరింతగా చూపిస్తోంది. దక్షిణాది సంప్రదాయానికి ఆధునిక ఫ్యాషన్ టచ్ జోడించిన ఈ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఈ ఫొటోషూట్‌కు సంబంధించిన స్టైలింగ్‌ను ఏకల ఖని, హర్షేన్ రవిచందర్ చేశారు. జుట్టు అలంకరణ, మేకప్, ఫొటోగ్రఫీ విభాగాల్లో ప్రత్యేక నిపుణులు పనిచేశారు. త్రిష స్వయంగా మేకప్ చేసుకోవడం కూడా ఈ లుక్‌లో మరో ప్రత్యేకతగా నిలిచింది. మొత్తం ఫొటోషూట్‌లో ఆమె వ్యక్తిత్వానికి తగ్గట్టుగా సింపుల్, ఎలిగెంట్ స్టైల్‌ను ఎంచుకున్నారు.

సినీ ప్రయాణం ఇలా..

1983 మే 4న చెన్నైలో జన్మించిన త్రిష కృష్ణన్ 1999లో మిస్ చెన్నై టైటిల్‌ను గెలుచుకుని తొలుత మోడలింగ్ రంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల వైపు అడుగుపెట్టిన ఆమె 'జోడి' చిత్రంలో సహాయ పాత్రతో వెండితెరకు పరిచయమయ్యారు. 2002లో విడుదలైన 'మౌనం పేసియాదే' చిత్రంతో కథానాయికగా మంచి గుర్తింపు సంపాదించారు.

ఆ తర్వాత తమిళ చిత్ర పరిశ్రమ లో వరుస విజయాలతో త్రిష స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. 'సామీ', 'గిల్లి' వంటి చిత్రాలు ఆమె కెరీర్‌కు మంచి బలాన్నిచ్చాయి. తెలుగులో 'వర్షం' సినిమాతో ఆమెకు భారీ క్రేజ్ వచ్చింది. ఈ చిత్రం విజయంతో తెలుగు ప్రేక్షకులకు కూడా త్రిష మరింత దగ్గరయ్యారు. దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ అగ్ర కథానాయికల్లో ఒకరిగా నిలిచారు.

**విభిన్న పాత్రలతో గుర్తింపు**

కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ త్రిష తన నటనా ప్రతిభను నిరూపించుకున్నారు. 'విన్నైతాండి వరువాయా', '96' వంటి చిత్రాల్లో ఆమె చేసిన పాత్రలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ముఖ్యంగా '96'లో జానకి పాత్ర ఆమె కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది.మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియిన్ సెల్వన్' రెండు భాగాల్లోనూ త్రిష కీలక పాత్రలో కనిపించారు. యువరాణి కుందవై పాత్రలో ఆమె చూపించిన హుందాతనం, నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే 'లియో' వంటి భారీ చిత్రాల్లోనూ నటించి తన స్టార్‌డమ్‌ను కొనసాగించారు. దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నప్పటికీ త్రిష ఇప్పటికీ అగ్ర కథానాయికగా రాణిస్తున్నారు.

**అవార్డులతో సత్కారం**

త్రిష తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలతో పాటు పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా అందుకున్నారు. ముఖ్యంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో ఆమె నటనకు గుర్తింపు లభించింది. వాణిజ్యపరమైన విజయాలతో పాటు నటిగా తన పరిధిని విస్తరించుకోవడంపై ఆమె ఎప్పటికప్పుడు దృష్టి పెట్టారు.

**తాజా సినిమాలతో బిజీగా..**

2025లో త్రిష పలు ఆసక్తికరమైన చిత్రాల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 'ఐడెంటిటీ', 'విడాముయార్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ', 'థగ్ లైఫ్' వంటి సినిమాల్లో ఆమె నటించారు. విభిన్న కథాంశాలు, ప్రముఖ నటీనటులతో కలిసి పని చేస్తూ తన కెరీర్‌ను మరింత వైవిధ్యంగా కొనసాగిస్తున్నారు.రాబోయే రోజుల్లో సూర్యతో కలిసి నటిస్తున్న 'కరుప్పు'తో పాటు 'విశ్వంభర' వంటి చిత్రాల్లోనూ త్రిష కనిపించనున్నారు. సుదీర్ఘ సినీ ప్రయాణం ఉన్నప్పటికీ కొత్త తరహా కథలు, పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించడం ఆమె ప్రత్యేకతగా చెప్పొచ్చు. అందం, అభినయం, హుందాతనం కలగలిపిన తనదైన శైలితో త్రిష దక్షిణాది సినిమా రంగంలో ఇప్పటికీ ప్రత్యేకమైన గుర్తింపును కొనసాగిస్తున్నారు.





# సంక్రాంతి బరిలో అనిల్ రావిపూడి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి.. ప్రస్తుతం తన తదుపరి సినిమాను శరవేగంగా తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న మేకర్స్.. షూటింగ్‌ను ఏమాత్రం ఆలస్యం చేయకుండా కొనసాగిస్తున్నట్లు సమాచారం.ఆదివారం, సెలవు రోజులు అనే తేడా లేకుండా వరుస షెడ్యూల్స్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సీజన్‌లో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ సినిమా లాంచ్ రోజునే ప్రకటించారు. దీంతో అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేసేందుకు యూనిట్ వేగంగా పనిచేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.షూటింగ్ వేగంగా సాగుతున్నప్పటికీ క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని సమాచారం. దర్శకుడు అనిల్ రావిపూడితో పాటు నిర్మాణ సంస్థ కూడా ప్రతి సన్నివేశాన్ని అత్యుత్తమంగా తెరకెక్కించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రొడక్షన్ క్వాలిటీ, విజువల్ స్కేల్‌పై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరించిన సన్నివేశాల అవుట్‌పుట్ అద్భుతంగా రావడంతో చిత్రబృందంలో మరింత ఉత్సాహం పెరిగినట్లు తెలుస్తోంది. సంక్రాంతి విడుదలకు ముందే షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి సీజన్ టాలీవుడ్‌కు కీలకమైన రిలీజ్ విండో కావడంతో 'వెంకీ-అనిల్ 5'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పండుగ వాతావరణానికి తగ్గట్టుగా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ క్రేజీ మల్టీస్టారర్‌లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ హీరోలుగా నటిస్తుండగా.. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా కనిపించనున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో సంక్రాంతి బరిలో మరో విజయాన్ని అందుకోవాలని అనిల్ రావిపూడి టీమ్ గట్టిగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034